


# సర్పశిల

## – భువనచంద్ర



*(గత సంచిక తరువాయి)*

ఇప్పటి వరకూ జరిగిన కథ

*ఓ అడవిలోనున్న ఆలయం దగ్గర మొదలైన కథ, 'రాబీ వెబ్‌స్టర్ ' అనే అమెరికన్ ఇండియాలో దిగడంతో ఓ మలుపు తిరుగుతుంది. 'తక్షపురం 'లోని సర్పశిల ఒక మలుపుకి సంకేతమైతే 'నల్లమల 'లో జరిగిన విశ్వశాంతి యజ్ఞం మరో మలుపు. ఒక వైపున కొన్ని శక్తులు ప్రకృతి విధ్వంసానికి రచన చేస్తూంటే మరోవైపు ప్రకృతి రక్షకులు ప్రకృతిని కాపాడే ప్రయత్నాలు ముమ్మరం చేస్తుంటారు. అనేకానేక పాత్రలు తమ విధిని నిర్వర్తిస్తూవుంటాయి. అందరి లక్ష్యమూ ఒకటే - విశ్వశాంతి.*

**ఏళుమలైని** చూడగానే అందరూ షాక్ తిన్నారు. యజ్ఞప్ప శరద్వతి తప్ప. శరద్వతికి ఎందుకో కొన్ని రోజులనించీ ఏళుమలై గుర్తుకొస్తున్నాడు. ఏళుమలైని చూడని వ్యక్తి మదాలస. ఆమె నిలబడి అందరివంకా ఆశ్చర్యంగా చూస్తోంది.

"కార్ రెడీ సార్. పెట్రోలు ఫుల్. అన్నీ చెక్ చేశాను" వినయంగా అన్నాడు ఏళుమలై, ఏదీ గుర్తులేనట్టు.

"నన్ను గుర్తుపట్టావా?" అడిగాడు జయ్.

"యస్సార్.. మద్రాసునించి తిరుపతికి పంపింది మీరేగా!" అన్నాడు ఏళుమలై.

"మరి నన్ను?" అడిగాడు శ్రీనివాస్.

"మిమ్మల్ని మధ్యప్రదేశ్‌కి తీసికెళ్ళాను గదు సార్. ఆ విషయం ఎలా మరిచిపోతానూ. పెళ్ళానికీ పిల్లలకీ దూరమై ఉండాల్సి వచ్చింది" చిన్నగా నవ్వి అన్నాడు ఏళుమలై. అందరికీ మరోసారి షాక్.

అంటే జరిగిందంతా ఇతనికి స్పష్టంగా గుర్తులేదా? విలియమ్స్ ఆవహించడం మరిచిపోయాడా?

ఇవే ప్రశ్నలు జయ్‌లోనూ, శ్రీనివాస్‌లోనూ శరద్వతిలోనూ దోబూచులాడాయి.

"ఇంకేమీ గుర్తులేదా?" అడిగాడు శ్రీనివాస్.

"ఎంపి  వెళ్ళి వచ్చాక కొంతకాలం నాకు మతి స్థిమితం తప్పిందని మా ఇంట్లో వాళ్ళు అన్నారు. ఆ తరవాత బాగానే ఉంది. ప్రస్తుతం యీ కంపెనీలోనే 40 శాతం ఓనర్‌గా ఉంటున్నాను" అన్నాడు ఏళుమలై.

రాబీ జరిగేదంతా చూస్తున్నాడు. అతని ముఖం నిర్వికారంగా ఉంది.

"కనీసం..." ఏదో చెప్పబోయి ఆగింది శరద్వతి.

ఏళుమలై ఏమీ మాట్లాడలేదు. వినయంగా నిల్చున్నాడు అంతే.

"సరే సరే.. టైం అవుతోంది" లగేజ్ వైపు వెళ్ళాడు జయ్.

"నేను తెస్తాను సార్" డిక్కీ ఓపెన్ చేసి శ్రీనివాస్‌తో పాటు సామాన్ల వైపుకి నడిచాడు ఏళుమలై.

యజ్ఞప్ప, శాస్త్రిగారు విస్తుపోయి చూస్తున్నారు. ఏళుమలై ముఖంలో వారికెలాంటి అసహజత్వమూ కనిపించలేదు.

"ఓకె స్నేహితుర్లారా, యజ్ఞప్పగారు, శాస్త్రిగారు.. శెలవు. ఇన్నాళ్ళూ కలిసి మెలసి ఉన్నాం. భగవంతుడు ఎందుకు కలిపాడో ఎందుకు మళ్ళీ ఎవరిదారిన వాళ్ళని పంపుతున్నాడో తెలీదు. కానీ కాలం కారణం లేకుండా ఏదీ చెయ్యదు కదా! శాస్త్రిగారు గొప్ప ఆతిధ్యాన్ని ఇచ్చారు. శ్రీనివాస్, శరద్వతీ, నా మాటకోసం మీరు చాలా కష్టపడ్డారు. ధన్యవాదాలు అందరికీ" అంటూ కారులో కూర్చున్నాడు జయ్.

'వెళ్ళొస్తా' అన్నట్టుగా అందరివంకా చూసి సైలెంటుగా కారెక్కాడు రాబీ.

ఒక్కసారిగా మౌనం నాట్యం చేసింది. కారు వెళ్ళిపోయిన చాలాసేపటిదాకా వాళ్ళు గేటు దగ్గరే నిలబడి ఉన్నారు.

"సడన్‌గా మనం అందరం ఓ స్వప్నంలో ఉన్నట్టు ఉంది. అసలు నేనూ, స్టిట్సన్, గోర్కీ, అతీమ్, దద్దానీ, డాంటే మేమందరం ఎందుకొచ్చాం? అసలీ ప్రపంచం ఎప్పుడు అంతమైతే ఏమిటి? అందరితో బాటే మనమూ వెళ్ళిపోతాంగానీ, మనకోసం ఎవరూ ఉండరుగా! సరే. ఒకవేళ ప్రళయమే వస్తే మనం ఎలా ఆపగలం. ఆపాలంటే అపారమైన శక్తి ఉండాలి. ఆ శక్తిని ఇచ్చేదెవ్వరూ? యజ్ఞప్పగారూ, శాస్త్రిగారు మాలో ఉన్న పెద్దలు మీరే. మీకేమైనా అసలు అర్థమౌతోందా? ఇంకో గంటకో రెండు గంటలకో అందరం ఎవరిదారిన వాళ్ళు వెళ్ళి పోతాం. పోనీ రెండు రోజులనుకుందాం! ఇక్కడ కలిసి భోంచెయ్యడానికేనా ఇక్కడికొచ్చింది?" ఓ ట్రాన్స్‌లో మాట్లాడినట్లుగా అన్నాడు శమంతో.

"కొన్ని సంఘటనలు జరుగుతై. అంతే. వాటికిజవాబులు ఉండవా అంటే ఉంటై. కానీ సమాధానం మాత్రం ఎప్పుడొస్తుందో ఎవరికీ తెలీదు. గాంధీ పుట్టినప్పుడో, నెహ్రూ పుట్టినప్పుడో వాళ్ళు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొంటారని ఎవరైనా ఊహించారా? భగత్ సింగ్, ఆజాద్, రాజ్‌గురు ఉరికంబాలకి వేళ్ళాడతారని వాళ్ళ వాళ్ళుగానీ, ఆ ఊరివాళ్ళుగానీ ఊహించారా? అల్లూరినీ, మార్టిన్ లూథర్‌కింగ్‌నీ అంతం చేస్తారని ఎవరన్నా కలగన్నారా? శమంతా.. కాలం అనిర్వచనీయం. ఏ నిర్వచనాలూ, నిబంధనలూ, దాని ముందు నిలబడలేవు. ప్రవహించడం దాని లక్షణం. అంతే. ఓ సృష్టి, ఓ స్థితి, ఓ లయ, ఓ మహాప్రళయం, మరో ప్రళయానంతర సృష్టి – ఇవన్నీ కాలంలో భాగాలే. ఇన్ని కోట్ల మంది లోకంలో ఉండగా మనం మాత్రమే ఎందుకు కలవాలి? మనకి మాత్రమే రాబర్ట్ వెబ్‌స్టరో, శరీరం లేని విలియమ్స్ ఎందుకు తారసపడాలి? ఎక్కడో ఉన్న తక్షపురానికీ, మరెక్కడో ఉన్న అడవిలోని శిధిలాలయానికీ సంబంధం ఏమిటీ? ఈ ప్రశ్నలు నీలోనూ నాలోనే కాదు అందరిలోనూ ఉన్నాయి. జవాబులు లేవు. లేవంటే లేవని కాదు...లభించవలసినపుడు మాత్రమే లభిస్తాయి. అంతవరకూ శాంతం వహించడమే మంచిపని" నెమ్మదిగా, స్పష్టంగా అన్నారు పరమేశ్వర శాస్త్రిగారు.

"నిజం. మీరన్న ప్రతిమాటా నిజమే" తలవూపి అన్నారు యజ్ఞప్ప.

"అవును. చేసేది ఏదీలేనప్పుడు మౌనంగా చూస్తూ ఉండటమే ఉత్తమం" అన్నారు శాస్త్రిగారు.

ఓ చల్లని గాలి వీచింది. అప్పటివరకూ అంగుళం కూడా కదలని చెట్ల కొమ్మలు ఆనందంగా ఊగసాగాయి.

"మీరంతా వెళ్ళిపోతున్నారంటే బెంగగా ఉంది" అన్నారు శాస్త్రిగారు సుదీర్ఘంగా నిట్టూరుస్తూ.

"తప్పకుండా డాక్టరుగారు.. వచ్చేది పోవడానికే, పోయేది తిరిగి రావడానికే అని పెద్దలు ఎప్పుడో చెప్పారుగా! ఈ లోకంలో మనుషులే కాదు.. అన్నీ వచ్చిపోయేవే. మనదంటూ అసలు ఏదీ? దేహం తల్లిదండ్రులు పెట్టిన బిక్ష.. తండ్రి బీజాన్ని ఇస్తే తల్లి అండాన్ని ఇచ్చింది. రెండూ కలిసి పిండంగా మారాయి. పెరిగి పెద్దయ్యాక పంచేంద్రియాలనే పంచభూతాల్నీ వదిలి వెళ్ళిపోతాయి. ఇప్పుడు మనం కూర్చున్న చోటు 'మనది' అనుకుంటాం. వందేళ్ళ క్రితం యీ చోటు ఎవరిది? వందేళ్ళ తరవాత ఏమౌతుందోనని ఇప్పుడు అలోచించడం వెర్రితనం" డాక్టరు గారితో అన్నారు యజ్ఞప్ప.

శరద్వతి అందరికీ మరోసారి టీ ఇచ్చింది.

"ఓకె... ఫేర్ వెల్ టీ ఇది" నవ్వి అన్నాడు మొహమ్మద్ అతీమ్.

"అవును. వెల్‌కమ్ టీ, ఫేర్‌వెల్ టీ అనేది భారతీయ సంస్కృతి. భారతదేశమే కాదు ఎన్నో దేశాలు యీ సంస్కృతిని పాటిస్తాయి. అసలు పద్ధతి ఏంటంటే, ఎవరు ఇంటికి వచ్చినా ముందు కాళ్ళూ చేతులు మొహం కడుక్కోవడానికి నీళ్ళు

ఇచ్చి, ఆ కార్యక్రమం తరవాత టవల్ అందించి, ఆ తరవాత చక్కగా కూర్చోపెట్టి ముందు మంచినీళ్ళు , ఆ తరవాత టీనో, కాఫీనో, మజ్జిగో, షర్బత్తో ఇస్తారు" అన్నారు శాస్త్రిగారు.

"ఎందుకు?" అన్నాడు డాంటే.

"సపోజ్ మీరు నామీద విపరీతమైన కోపంతో నన్ను కొట్టడానికో, తిట్టడానికో రావచ్చు. లేదా ఎండలో అలిసిపోయి రావొచ్చు. ఎప్పుడైతే చల్లని నీళ్ళతో కాళ్ళూ చేతులు కడుక్కుంటారో, కోపం అయితే చల్లబడుతుంది, అలసట సగానికి సగం తగ్గుతుంది. ఆ తరవాత చల్లని నీళ్ళు తాగితే ఇంకా శాంతపడతారు. కాఫీ తాగాక అలసట మాయమై ఉత్సాహం పుడుతుంది. అందువల్ల యుద్ధాలు, నీరసాలు పక్కకి పోయి  శాంతియుత సంభాషణలు, ఉత్సాహ పూరిత సంభాషణలూ మొదలవుతై" నవ్వి అన్నారు శాస్త్రిగారు.

"ఓహ్ గ్రేట్.! గొప్ప ఆలోచన అది. మీ పూర్వీకులు ప్రతిదాన్నీ చాలా సున్నితంగా ఆలోచించి, ఆ ఆలోచించినవాటిని సంప్రదాయాలుగా మీకు అలవాటు చేశారు. నిజం చెబితే మీ నుంచి మేం నేర్చుకోవలసింది సప్తసముద్రాల అంత ఉంది" గుండెనిండా మెచ్చుకుంటూ అన్నాడు స్టిట్సన్.

"ఆ మాట నిజమే అయినా, కొన్ని వేల తరాల నుంచీ తరతరానికీ పదునెక్కే సత్కర్మలు కొన్ని దేశాల్ని మాత్రమే ప్రభావితం చేసి ప్రపంచానికి దారి చూపగలవు. మాది 'గన్' సంస్కృతి. కోపం వస్తే కాల్చి పారేయడం. కేవలం ధనానికీ, పదవికీ ప్రాముఖ్యతనివ్వడం, కేవలం తెల్లవాళ్ళు మాత్రమే అధికులు అనుకోవడం, మిగతా అన్ని జాతుల్నీ కించపరచడం, బానిసలుగా చూడటం మాకు ఉగ్గుపాలతో అలవాటయింది. ఏ మాత్రం శాంతి, సౌభాతృత్యం మానవత్వం, క్షమ ఇవి మీ రక్తంలో ఇంకిన లక్షణాలు. నిజమైన బలాలు మీవి. లోకానికి హాని జరిగేది ఎప్పుడూ అహంకారపు ముసుగు తొడుక్కున్న బలహీనులతోనే" యజ్ఞప్పగారి వంక చూస్తూ అన్నాడు స్టిట్సన్.

"ఈ మాట నూటికి నూరు పాళ్ళూ రైట్. భారతీయులు ఆధ్యాత్మికవాదులు. మేం పదార్థవాదులం. అందుకే బలహీనతల బంధాల్లో చిక్కుకుపోయి, జీవితం క్షణ భంగురం అనే వాస్తవాన్ని విస్మరిస్తాం" అన్నాడూ రాజోస్కీ.

"మీరేమంటారు?" రామజోగిని అడిగాడు దర్లానీ.

"ఒక మహా వేగంతో వస్తున్న తుఫాను ఎందుకో దారి మళ్ళింది. తీవ్రత తగ్గించుకుంది. అందుకు సంతోషపడాలో, లేక వెయ్యిరెట్లు బలం పుంజుకుని భూమిని అతలాకుతలం చేస్తుందని భయపడాలో తెలియడం లేదు. దేశాలూ, వర్ణాలూ ప్రజలూ ఇవి పక్కన పెడితే, ముప్పు వాటిల్లేది సర్వమానవాళికీ. ఆ ముప్పు ప్రస్తుతానికి విశ్రాంతి నిచ్చింది. ఆ విశ్రాంతి కూడా ఎంతకాలమో తెలీదు. మిత్రులారా.. ఏదో జరగబోతోంది. ఆ జరగబోయేది ఏమిటో మాత్రం తెలీడంలేదు" ఎవరి

వంకా చూడకుండా అన్నాడు రామజోగి. అందరూ మౌనంలోకి జారిపోయారు. మదాలస పెదాల మీద సన్నటి చిరునవ్వు కదలాడితే, శ్రీనివాస్ మనసులో ఏళుమలై, రాబీ కదులుతున్నారు. విలియమ్స్ మళ్ళీ రాబీని ఆవహిస్తాడా? అమెరికానించి ఇండియాకి రప్పించి ఇంత శోధనకి పెంచిన విలియమ్స్ అసలు ఏమయ్యాడూ? అతని ఆత్మ పరమాత్మలో కలసిపోయిందా? ఇవన్నీ శ్రీనివాస్ మనసులో ప్రశ్నలు.

"రాబర్ట్ గురించి ఆలోచిస్తున్నావా?" అడిగాడు రామజోగి శ్రీనివాస్‌ని. 'అవును' అన్నట్లుగా తలపంకించాడు శ్రీనివాస్.

"నా మనసులో ఉంది రాబర్టే. వెళ్తూ కూడా అతను ఎవరితోటీ మాట్లాడలేదు. సోషల్ బిహేవియర్లో అమెరికన్స్ బెస్ట్. అటువంటి వాడు సైలెంటుగా వెళ్ళిపోవడం నన్ను కలతకి గురిచేస్తోంది" రామజోగి వంక చూస్తూ అన్నాడు గోర్కీ "అవును" ముక్తసరిగా అన్నారు యజ్ఞప్ప.

"మనకే ఇలావుంది, దేశం కాని దేశానికి వచ్చి ఊహలకి కూడా అందని జీవితం, అదీ అపరిచితుల మధ్యన గడిపిన 'రాబీ' మనస్థితి ఎలా ఉంటుందో ఊహించండి. వెళ్ళేముందు ఓ మాట అందర్నీ ఉద్దేశించి చెప్పాడుగా! అంతకంటే చెప్పడానికి అతని దగ్గర మాత్రం ఏముంటుందీ?" అన్నది మదాలస.

"అవును.. ఈ రోజు నించి పెర్ఫెక్ట్. సరే. ఎప్పుడు ఎలా ఏం జరుగుతుందో ఎవరికి తెలుసూ" అన్నాడు శృంగి.

ఎవరి ప్రయాణపు సర్దుబాట్లలో వారున్నారు. న్యూస్ టైం. డాక్టరుగారు టివి ఆన్ చేశారు.

కాసేపు జనరల్ న్యూస్ చెప్పాక, "ఇప్పుడు ఒక విచిత్ర వార్త. రాజస్తాన్ రాయ్‌సింగ్ నగర్‌లో ఒక మధ్య తరగతి కుటుంబంలో ఒక పిల్లవాడు జన్మించాడు. చిత్రం ఏమంటే, పుట్టినప్పుడు అతని కళ్ళు తెరిచే వున్నాయి. అంతేకాదు.. అందరివంకా చూశాడట. అలాగే నోట్లో ఎనిమిది పళ్ళతో పుట్టాడట. జనం తండోపతండాలుగా ఆ పిల్లవాడిని చూసి ఆశ్చర్యపోతున్నారు" అని టివిలో ఆ పిల్లవాడ్ని చూపించింది న్యూస్ రీడర్.

"గాడ్! మీరేమంటారూ?" డాక్టర్ని అడిగాడు శ్రీనివాస్.

"ఇటువంటి సంఘటనల గురించి విన్నాను. కానీ చూడటం ఇప్పుడే. పిల్లవాడి శరీరం పెర్ఫెక్ట్‌గా ఉంది. కళ్ళు తెరుచుకుని పుట్టడం, పళ్ళు ఉండటం విషయం మాత్రం నాకేమాత్రం అర్ధంకాలేదని డాక్టరినికూడా నిస్సిగ్గుగా చెబుతున్నాను. ఒకవేళ అయితే గియితే ఇదో 'హార్మోనల్ వండర్' అనొచ్చు" అన్నారు డాక్టరు గారు. చెప్పిందే చెబుతూ ఆ పిల్లవాడ్ని దాదాపు మూడు నిమిషాలు న్యూస్‌లో చూపించారు.

"మైగాడ్" షాక్‌లో అన్నాడు అతీమ్.

"ఆ పిల్లవాడి నుదురు, చూపు చూశారా? చాలా సీరియస్‌గా అందర్నీ అబ్జర్వ్ చేస్తున్నాడు. ఇది మాములు పుట్టుక కాదు" అన్నారు శాస్త్రిగారు.

"మీకందరికీ గుర్తుందా? ఢిల్లీ సమీపంలో ఓ వాగులో 'షగున్' అనే కుర్రవాడు జన్మించాడు. కొన్ని వేల ఇళ్ళు నేలమట్టం అయ్యాయి. కొన్నివందలమంది నిరాశ్రయులయారు. గుర్తుకొచ్చిందా? ఆ శిశువుకీ ఈ శిశువుకీ సంబంధం ఏదన్నా ఉండి ఉంటుందా? ఆ శిశువు నవ్వాడు. ఈ శిశువు చూపుల్తో సర్వాన్నీ పరిక్షిస్తున్నాడు. ఇద్దరి పుటకలూ సహజంగా లేవు. ఆలోచించి చూడండి. మీకేమైనా తడుతుందేమో!" తీవ్రమైన ఆలోచనతో అన్నాడు గోర్కీ.

"యస్.. ఈ విషయం ఆలోచించవలసిందే" అన్నాడు అతీమ్.

"ఉండొచ్చు.. ఉండకనూ పోవచ్చు. లక్ష విషయాలు జరిగితే పేపర్లకీ, విజువల్ మీడియాకీ ఎక్కేవి కొన్ని పదులు మాత్రమే. ఎందుకంటే, అన్ని చోట్లా విలేకరులు ఉండరు. ఉన్నా, వారికి ఆశ్చర్యం కలిగించేవి మాత్రమే రాసి పోస్టు చేస్తారు. వాటిల్లో 'ఎడిట్' అయ్యేవి కనీసం ఏడెనిమిదివంతులు. కనక ఇవి కాకతాళీయంగా పుట్టిన పుట్టకలు కావొచ్చు, మరో విధంగా ఆలోచిస్తే, ప్రతి పుట్టుక వెనుక ఓ నిగూఢ రహస్యం ఉంటుంది. లక్షలమందిని ఊచకోత కోయించి కాన్సంట్రేషన్ కేంపులకు పంపిన హిట్లర్ జీవితమూ భగవంతుడి సృష్టే. కోట్లాది మందిని తన శాంత ప్రవచనాలతో ప్రేరేపించి స్వాతంత్ర్య సమరానికి సిద్ధపరచిన బాపూజీది భగవంతుని సృష్టే. మిత్రులారా ఓ విధంగా ఆలోచిస్తే మన మంచికీ చెడుకీ కూడా కారణం మనమే. ఇంకో విధంగా ఆలోచిస్తే మనం కేవలం చదరంగం బోర్డు మీద ఉన్న పావులం. ఆడుతున్నదీ ఆడిస్తున్నదీ మనకి తెలియని వేరే శక్తి" అన్నారు డాక్టరుగారు.

"యస్.." నెమ్మదిగా శరద్వతి. ఆమెలో ఎన్నో ఆలోచనలు.

"అమ్మాయ్.. ఆలోచించకు. అనంత సృష్టిలో అనంతమైన రహస్యాలు ఉన్నాయి. అయినా ఎందుకు పుడతారో తెలిసింది ఎవరికీ. జీవితమనే నాటకంలో ఎవరి పాత్ర వాళ్ళు పోషించి వచ్చిన చోటుకి తిరిగి పోవాల్సిందే. ప్రకృతి యొక్క సృష్టి ఎంత సహజమో, ప్రళయ సృష్టి కూడా అంతే సహజం. కేవలం మనుషులూ జీవులూ మాత్రమే కాదు విశ్వంలోని ప్రతిగ్రహమూ నక్షత్రమూ కూడా ఓ అదృశ్య శక్తికి లోబడినవే. అందుకే అవి నియమం తప్పవు. ఒక్క గ్రహమో, నక్షత్రమో నిర్దుష్టమైన దాని నియమం తప్పి 'గతి' మారితే? జరిగే సర్వనాశనాన్ని ఊహించగలవా? అందుకే, హాయిగా ఉండు. సినిమా చూసినట్టు జీవితాన్ని చూడగలిగితే అంతకు మించిన సుఖం లేదు" అన్నారు డాక్టరుగారి భార్య.

"మంచి మాట చెప్పారు" అన్నాడు శృంగి. శృంగికి శిధిలాలయానికి వెళ్ళాలని ఎంత తొందరగా ఉందో, మధురగారి దగ్గరికి రామజోగితో కలిసి వెళ్ళాలన్న తొందరా వుంది.

శృంగి దృష్టిలో మధుర దేవుడిచ్చిన తల్లి. మట్టూ ఆలోచనలు వేరుగా ఉన్నాయి. అతని మనసులో తక్షకాలయం దగ్గర పాములా చేతులు మెలికలు తిప్పుతూ తిట్టిన వృద్ధురాలు క్షణానికోసారి జ్ఞాపకం వస్తోంది.

"అమ్మా" పిలిచింది మహా కన్యాదేవి. అప్పటికి అర్ధరాత్రి దాటింది. మహామాయ (మాయామయి) "చెప్పు తల్లీ" అన్నది.

16 కన్యలు తప్ప ఎవరూ నిద్రపోవడంలేదు. హనుమంతు లేచే ఉన్నాడు.

"అమ్మా.. 'జటా వల్లరి ' గుర్తుందా? ఉజ్జయినిలో నాకు పంచలోహ శ్రీ చక్రం ఇవ్వడమే కాక నాకు **ఆరీచనాడి** గురించి కూడా చెప్పింది. ఆ శ్రీ చక్రం ఎక్కడుందీ?" అడిగింది మహా కన్యాదేవి.

"పీఠంతోనే తెచ్చాను. ఇస్తాను" అని మహామాయి పూజాపీఠం నించి పంచలోహ శ్రీ చక్రాన్ని మహాకన్యాదేవికి ఇచ్చింది.

ఆ శ్రీ చక్రం అరచేతిలో ఇమిడేంత ఉన్నది. కానీ ఆ కాస్త, చిన్న శ్రీ చక్రం పది కిలోల బరువులా అనిపించింది మహామాయికి. మహా కన్యాదేవి పద్మాసనంలో కూర్చుని ఆ పంచలోహ విగ్రహాన్ని తలమీద స్థిరంగా పెట్టి ధ్యానం చేయసాగింది. హనుమంతు ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

చాలా చాలా చాలా చాలా సేపు గడిచింది.

"హనుమంతూ, మనుషులేని విమానాలు ఎగురుతున్నాయి. గ్రహాల్లా పరిభ్రమించే చిన్న చిన్న గ్రహాల్లాంటివి ఉన్నాయి. ఆకాశం అంతా నిశబ్దంతో నిండిపోయింది. ఆ చిన్న గ్రహాలు ఎలా తిరుగుతున్నాయంటే, ఒక్క గ్రహం గతి తప్పితే వందలకొద్దీ ఆ చిన్న గ్రహాలు గతి తప్పి ఒకదాన్నొకటి ఢీకొట్టుకుని భూగ్రం మీద ఉన్న ఏ సమాచారం ఎవరికీ అందదు. వందల విమానాలు, వందల మైళ్ళు, వందల వేల బస్సులు ఛిన్నాభిన్నం అయిపోతాయి. వరదలు ఊళ్ళనీ నగరాల్నీ సర్వనాశనం చేస్తాయి. గుళ్ళు పగుళ్ళు తీస్తాయి. మనిషి మనిషిని నమ్మడు. దేవుడ్నీ నమ్మడు. అందుకే దేవాలయాల్లో మనుషులు యీగల్లా దోమల్లా మరణిస్తారు. అవి సహజంగా జరిగేవి కొన్ని అయితే, గవర్నమెంటు ఇచ్చే డబ్బుల కోసం జరిగేవి కొన్ని. నాయనా ఇంత ఘోరాలు జరుగుతాయా అనకు. పిల్లల్ని వదిలేసి ప్రియుడితో లేచిపోయే స్త్రీలు పెరుగుతారు. డబ్బు కోసం పెళ్ళి చేసుకుని నెలలోపే ప్రియుడితో చేతులు కలిపి ఆ భర్త డబ్బుని సంపాదించాలనే

సరికొత్త భార్యలు పుట్టుకొస్తారు. గురువులు చిన్నారి శిష్యురాళ్లని బలాత్కరించి చెరపడితే ఉపాధ్యాయినులు అభం శుభం తెలియని మగపిల్లల్ని సుఖం మప్పుతారు. కన్న తండ్రులే కూతుళ్ళని చెరుస్తారు. అహంకారాలు రాజ్యమేలుతాయి. ధనవంతులకి బానిసలైన రక్షక భటులు సామాన్యుడిని నమిలి మింగుతారు. న్యాయస్థానాల్లో గెలిచేది తెలివైన ప్లీడర్లేగానీ న్యాయంకాదు. నువు పుట్టిన దేశంలోనే నువ్వెవరికి పుట్టావో రుజువు పరుచుకోవాల్సిన దౌర్భాగ్యం దాపురిస్తుంది. నాయనా... కలి 'కథ' నేను చెప్పినా నువు వినలేవు" అన్నది మహాకన్యాదేవి.

హనుమంతు వింటున్నాడు.

"పంట పొలాలన్నీ పోరాటక స్థలాలుగా మారిపోతాయి. రైతులు ఉరివేసుకుంటారు. పశువులు గడ్డి దొరకక ఆకలితో అల్లాడుతూ చనిపోతాయి. తల్లి తండ్రులు అసహజ క్రమంలో పిల్లల్ని కంటారు. తల్లి అంశం తండ్రి బీజం ఇస్తే పిండం ఇంకొకరి గర్భాశయంలో పెరుగుతుంది. అన్నీ కృత్రిమమే. అంతా కృత్రిమమే అందుకే, కృత్రిమ క్షేత్రాలన్నీ కుప్పకూలిపోతాయి హనుమా! వాయువ్యం నించి మేఘాలు కమ్ము కొస్తున్నాయి. అవి కురిసేది వర్షాల్ని కాదు. చంద్ర నిప్పులని. కోట్లాది జీవులు నశించి పోతై. ఏది నాగరికత అనుకుంటూ పోతే అదే ఆటవిక చర్య అవుతుంది. హనుమా..., కాలపు కళ్ళు ఎర్రబడుతున్నాయి. రక్షించేది ఎవరూ? వెతుకు..వెతుకు..వెతుకు.." ఏదో ఒక ట్రాన్స్‌లో వున్నట్లు మాట్లాడుతోంది మహా కన్యాదేవి. కొన్ని మాటలు హనుమంతుకి అసలు అర్థం కాలేదు.

"ఏం వెతకను తల్లీ?" అడిగాడు హనుమంతు.

"భూమిలోలోపనించి ఏనుగులకంటే చాలా పెద్దవీ, బలమైనవీ భూమిని చీల్చుకుని బయటకు వస్తాయి. వాటికి కళ్ళు ఉండవు. కానీ అన్నింటినీ గుర్తించగలవు. మంచు కొండలు కరిగిపోతాయి, ఘోరమైన వర్షాలు కురిసి లక్షలాది మందిని చంపితే, సముద్రాలు కొన్ని చోట్ల ఇంకిపోయి చిత్ర విచిత్ర జంతువులు భూమ్మీద నరకాన్ని సృష్టిస్తాయి" మళ్ళీ ఆగింది మహా కన్యాదేవి.

"ఏం చెయ్యాలీ?" అడిగాడు హనుమంతు.

“మళ్ళీ కృష్ణుడు ఉదయించాలి" అన్నది మహా కన్యాదేవి.

"ఇది కలికాలం కదా?" అడిగాడు.

"అందుకే రూపం, నామం, ప్రవృత్తీ మార్చుకుని వస్తాడు కృష్ణుడు. ఆయనకంటే ముందర... ముందర.. ముందర."

సడన్‌గా వెనక్కి వాలిపోయింది మహా కన్యాదేవి. పంచలోహ శ్రీ చక్రం శబ్దం చేస్తూ నేలమీద పడిపోయింది.

మహా కన్యాదేవి కళ్ళు మూసుకునే ఉన్నాయి.. స్పృహలో లేనట్టు.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Post your comments